నేడు ఆర్డీఓ కార్యాలయంలో 'ప్రజావాణి'

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, ఇతరత్రా అర్జీలు, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ వెంకన్న గుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. తెల్లవారుజామునే దేవాలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు, పారాయణం తదితర ఉత్సవాలు నిర్వహించారు. విశేష పాసురాలతో పాటు గోదా అమ్మవారికి విశేష పూజలు, అలంకరణ అనంతరం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా జరుగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీబీఐటీకి 'ఎక్సలెన్స్' అవార్డు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) నుంచి ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల అంకితభావం, సమష్టి కృషికి ఈ అద్భుతమైన అవార్డు మొదటిసారి దక్కిందని ప్రిన్సిపాల్ సి.వి.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణలు, పరిశోధనలలో రాణించాలనే అన్వేషణ ఈ విశిష్ట గౌరవాన్ని పొందటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ విద్యలో అగ్రభాగాన ఉన్న సీబీఐటీకి ఈ అవార్డు మరింత బలోపేతం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అంకితభావంతో పనిచేసుందుకు ఇది ఎంతో సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నేడు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ

రాయదుర్గం: సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయడం జరుగుతుందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తర్వాత ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

యోగా పోటీల్లో హెచ్‌సీయూ విద్యార్థుల సత్తా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రాయదుర్గం: యోగా పోటీలలో హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్-14 విభాగం యోగా సీఎం కప్ పోటీలలో క్యాంపస్ స్కూల్ నుంచి పాల్గొన్న 7వ తరగతి విద్యార్థిని వైష్ణవి రిథమిక్ యోగా విభాగంలో రంగారెడ్డి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఆమెను ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ మురళి మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా వంటి వాటిల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఇతర అంశాలపై కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

- రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిల అలంకరణ
- నయనానందకరంగా తీర్చిదిద్దిన నిర్వాహకులు
- ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



ముస్తాబైన రాజేంద్రనగర్‌లోని ఓ చర్చి

రాజేంద్రనగర్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో వాటని నేత్రపర్వంగా అలంకరిస్తున్నారు.

- అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని చర్చిలకు రంగులు వేసి క్రిస్మస్ కోసం సిద్ధం చేశారు. వివిధ రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలతో ఆయా చర్చిలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి.
- సర్కిల్ పరిధిలో 200లకు పైగా చర్చిలు ఉన్నాయి. క్రిస్మస్ రోజున ప్రత్యేక ప్రార్థనల కోసం తగు ఏర్పాట్లను సైతం చేస్తున్నారు. ప్రార్థనల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు...

క్రిస్మస్ నేపథ్యంలో ముందస్తుగా క్రైస్తవులు ఆయా చర్చిల్లో నిత్యం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని చర్చిల ఫాదర్‌లు తమ చర్చిలకు వచ్చే భక్తుల ఇళ్ల వద్దకు పాటల పాడుతూ వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. రోజూ తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ఈ ప్రార్థనలు కొనసాగుతున్నాయి.

క్రీస్తు జన్మ వృత్తాంతంపై...

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏసు క్రీస్తు జన్మ వృత్తాంతంపై రూపొందించిన ప్రత్యేక నాటకాలను వేసేందుకు క్రైస్తవులు తగు ఏర్పాట్లు చేశారు. చర్చిల్లో ఇందుకోసం ప్రత్యేక షెడ్‌లను వేస్తున్నారు. అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయా నాటకాలను వేసేందుకు తగు రిహార్సిల్స్‌ను చేస్తున్నారు.

క్రిస్మస్ ట్రీలతో...

రాజేంద్రనగర్ పరిధిలో అన్ని చర్చిలలో ప్రత్యేకంగా క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేస్తున్నారు. పలు చర్చిలలో ప్రత్యేకంగా క్రిస్మస్ ట్రీలను నాటి వాటిని ఏపుగా పెంచారు. వీటికి వివిధ రకాల విద్యుత్ దీపాలను అలంకరించి అందంగా ముస్తాబు చేస్తున్నారు. క్రిస్మస్ ట్రీలు లేని చర్చిల వద్ద మార్కెట్‌లో లభిస్తున్న ప్లాస్టిక్ చెట్లను తీసుకొచ్చి ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి ఇంటిపై స్టార్...

సర్కిల్ పరిధిలోని క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్టార్‌లను తమ ఇళ్లపై వేలాడ తీస్తున్నారు. మార్కెట్‌లో అధునాతంగా లభిస్తున్న ఎల్ఈడీ స్టార్ లైట్లు ప్రస్తుతం క్రైస్తవులు తమ ఇళ్లపై ఏర్పాటు చేసుకుంటున్నారు.

చెత్త నిర్మూలనకు సరికొత్త ప్రయోగం!

- చెత్త వేయకుండా చూసేందుకు సిబ్బంది నియామకం
- ప్రజల్లో చైతన్యం కల్పించే దిశగా ఏర్పాట్లు
- అయినా చెత్త వేస్తే జరిమానా తథ్యం
- సత్ఫలితాలిస్తున్న అధికారుల చర్యలు



బుద్వేల్ ఓపెన్ పాయింట్ వద్ద కాపలాగా ఉన్న కార్మికుడు

రాజేంద్రనగర్: ఓపెన్ పాయింట్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఓపెన్ పాయింట్ల వద్ద గతంలో శుభ్రపరిచి రంగు రంగుల ముగ్గులు వేసి చెత్త వేయవద్దంటూ ప్రచారం చేశారు. ఇది విజయవంతమైంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ చెత్త ఇతర వ్యర్థాలను వేస్తుండటంతో రేయింబవళ్లు కాపలాగా అక్కడే వాచ్‌మెన్ నియమించి చేసి చెత్త వేయకుండా అడ్డుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన ఓపెన్ పాయింట్ల వద్ద సిబ్బందిని నియమిస్తున్నారు. చెత్త వేసే వారిని సిబ్బంది అడ్డుకుంటున్నారు. వారి ఫొటోలను సైతం తమ సెల్‌ఫోన్లలో పంపిస్తుండటంతో ఓపెన్ పాయింట్ల వద్ద చెత్తను వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

- సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో దాదాపు 60 ఓపెన్ పాయింట్లను గుర్తించారు. ఈ పాయింట్ల వద్ద రోజే వాహనాలపై వెళ్లే వారు. స్థానికులు, దుకాణాల నిర్వాహకులు చెత్తను ఇష్టారాజ్యంగా వేసేస్తున్నారు. వీరికి ఒక్క పక్క కౌన్సిలింగ్ ఇస్తూనే ఆయా ప్రాంతాల్లో చెత్త వేయకుండా అడ్డుకునేందుకు వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఓపెన్ పాయింట్ల చెత్త వేయడం దాదాపు తగ్గిందని అధికారులు, సిబ్బంది వెల్లడిస్తున్నారు.

శుభ్రత పాటించండి...

బహిరంగ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయరాదని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ కోరారు. ఓపెన్ పాయింట్లలో ఇప్పటికే వాచ్‌మెన్‌లను నియమించాన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ వాచ్‌మెన్ ఏర్పాటు ద్వారా చెత్త డంపింగ్‌లను నిర్మూలించామన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో చెత్తను వేస్తున్నారని తెలిపా. వారిని గుర్తించి అపరాధ రుసుము విధిస్తామన్నారు. తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ దారులకు చెత్తను అందించాలని ఆయన కోరారు.

నార్సింగి మార్కెట్ అభివృద్ధికి కృషి



దశరథ్ యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

మణికొండ: నార్సింగి మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కమిటీ వైస్ చైర్మన్ క్యాతం దశరథ్ యాదవ్ పేర్కొన్నారు. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను మంచిరేవుల శ్రీ కృష్ణ యాదవ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మంచిరేవుల గ్రామంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌లో మెరుగైన వసతులు కల్పించేందుకు... రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు మాణిక్యం యాదవ్, ప్రధాన కార్యదర్శి పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ... నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా దశరథ్ యాదవ్‌ను ఎంపిక చేయటం మంచి పరిణామన్నారు. ఆయన ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణయాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

శంషాబాద్: మూడురోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి ఎయిర్‌పోర్టు పరిసరాల్లో మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన వెంకటయ్య(55) మూడురోజుల కిందట అదృశ్యం అయ్యాడు. ఆదివారం ఉదయం ఎయిర్‌పోర్టు ప్రాంగణ గేటు సమీపంలో కుళ్లిపోయిన మృతదేహం కనిపించడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఆధారాలతో పాలమాకులకు చెందిన వెంకటయ్యగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్తాపూర్‌లో అగ్ని ప్రమాదం

అత్తాపూర్: విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా డ్రైక్లీనింగ్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్ కాలనీలో ఎంఎం ఫ్యాబ్రిక్ పేరుతో డ్రై క్లీనింగ్ షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం షాపులో నుంచి మంటలు వస్తుంటాన్ని స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకొని అక్కడికొచ్చిన రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బంది నర్సింహా తదితరులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు రూ. 3 లక్షల మేర నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మార్పీఎస్ పీరంచెరువు గ్రామ కార్యవర్గం



సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న నాయకులు

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువులో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దప్పు అరుణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా వినోద్‌కుమార్ మాదిగ, ఉపాధ్యక్షులుగా నర్సింహ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా జె.అశోక్ మాదిగ, కార్యదర్శిగా రాజేష్ మాదిగ, కోశాధికారిగా డి.నరేష్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా దప్పు కళ్యాణ్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా బాబురావు మాదిగ, మల్లేష్ మాదిగ, సురేష్ మాదిగ, బొయిన మాదిగలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టగారి గణేష్ మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలులోకి తేవాలన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం



కాటేదాన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.చంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల రెండవ మహాసభలను కామ్రేడ్ బి.చిట్టెమ్మ ప్రాంగణం పేరుతో కాటేదాన్‌లోని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాటేదాన్ చౌరస్తా నుంచి సీఐటీయూ ఆఫీస్ వరకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పెరిగిన నిత్యావసాల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను అమలు చేయడం లేదన్నారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేదల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్‌షా అవహేళన చేస్తూ మాట్లాడటం దారుణమన్నారు. తెలంగాణలో గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం, అభ్యున్నతిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. విసిగిన ప్రజానీకం బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక...

సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా జాజాల రుద్రకుమార్, కమిటీ సభ్యులుగా జి.ఎం.కురుమయ్య, జి.ఎం.గట్టయ్య, ఎస్.రామ్మోహన్‌రావు, ఎన్.జంగయ్య, ఎస్.మోహన్, భాస్కర్, కాలే రాజు, బచ్చలకూర స్వామి, సువార్త, మణెమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే గాంధీ



గోల్డెన్‌తులిప్ కాలనీవాసులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అసోసియేషన్ ప్రతినిధులు

గచ్చిబౌలి: గోల్డెన్ తులిప్ కాలనీని ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ గోల్డెన్ తులిప్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో అధికారులు, కార్పొరేటర్ హమీద్‌పటేల్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తి రోడ్లను త్వరలో పూర్తయ్యేలా చూస్తామన్నారు. అనంతరం కాలనీవాసులు రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు, శానిటేషన్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ హమీద్‌పటేల్, ఎమ్మెల్యేను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు రేవతి, ఎస్‌వీఎస్‌రాజు, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీకృష్ణ, గిరిధర్, రాకేష్, రామారావు, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, రమాకాంత్, విజయ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పించాలి..

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఆదివారం గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలో గుల్‌మొహర్ పార్కు కాలనీ, నేతాజీనగర్‌లలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. అసంపూర్తి పనులను పూర్తి చేయడంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో గుల్‌మొహర్‌పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం, కాలనీవాసులు శారద, మోహన్ చారీ, గణేష్, సంతోష్, శ్రీనివాస్, సంధ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులే దరఖాస్తు చేసుకోవాలి

గోల్కొండ: అర్హులైన నిరుపేద కుటుంబాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ దరఖాస్తులో నిర్దేశించిన పత్రాలన్ని మీసేవాలో దరఖాస్తు చేసుకోవలన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, వైద్య చికిత్సల కోసం దరఖాస్తుదారు సరైన ధ్రువ పత్రాలు జత చేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునే వారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో పాటు దవాఖానా బిల్లులూ జత చేయాలన్నారు.

అధ్వానంగా శాతం చెరువు రోడ్డు

గోల్కొండ: గోల్కొండ నయా ఖిలాకు ఆనుకొని ఉన్న శాతం చెరువు నిర్వహణ అధ్వానంగా మారింది. గత పదేళ్లుగా ఈ చెరువు అభివృద్ధి ఇదిగో.. అదిగో అంటూ అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. ఒకప్పుడు ఆకట్టుకునే ఈ చెరువు దుర్గంధంగా తయారయ్యింది. బల్దియా ఎంటమాలజీ విభాగం వారు దోమల నివారణ కోసం చేపట్టే పనులు కూడా ప్రహసనంగా మారాయి. ఉన్నతాధికారులు అడపదడప వచ్చి పర్యటించి వెళ్తున్నారే తప్ప చెరువు సుందరీకరణను పట్టించుకోవడం లేదు. టోలిచౌకీ పరిసరాల వారు తమ వ్యర్థాలను తెచ్చి చెరువు కట్టపై డంపింగ్ చేస్తున్నారు. చెరువుకు వేసిన ఫెన్సింగ్ చెత్త డంపింగ్ కారణంతో ధ్వంసమయ్యింది. పలువురు జంతువుల వ్యాపారులు మృతి చెందిన జంతువుల కలేబరాలను పట్టపగలే చెరువు కట్టపై వదిలి వెళ్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా చెరువు రూపురేఖలు మారడం లేదని శాతం చెరువు ప్రాంతవాసులు అంటున్నారు.

గణితానికి ఉన్న ప్రాధాన్యం ఎంతో విస్తృతమైంది

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జీ.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ మెథమ్యాటిక్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ గణిత శాస్త్ర విభాగం ప్రొ. అండ్ హెడ్ డాక్టర్ ఎం.ఎస్.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రానికి ఉన్న ప్రాధాన్యం ఎంతో విస్తృతమైందని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సైన్స్‌కు తోడుగా గణిత శాస్త్రం కూడా ఉందన్నారు. కొద్దిగా గణితంపై ఆసక్తి పెంచుకుంటే ఇది సులువుగా అర్థం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల వారు జాతీయ గణిత క్విజ్‌ను నిర్వహించారు. దీనిలో 95 జట్లు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన వారికి ఎంఎస్ రాజశేఖర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.మాధవిలత, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు

- న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టిన కార్మికులు
- కాంగ్రెస్ పాలకులిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి
- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్



బండ్లగూడ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

బండ్లగూడ: మున్సిపల్ కార్మికులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. డిమాంట్ల సాధన కోసం బండ్లగూడ జాగీర్ చౌరస్తాలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో సందర్భంగా ఆ చౌరస్తాలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రుద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సుమారు 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్ పే డైలీ వేజెస్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్నారన్నారు. సిబ్బందికి పర్మనెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి ప్రభుత్వ సంక్షేమాలు అమలు కావడం లేదన్నారు. పని చేస్తున్న సమయంలో మరణిస్తున్నారని వాపోయారు. రెండవ పీఆర్‌సీలో కనీస వేతం రూ. 26 వేల ప్రకారం చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన, మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 50 వేల తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి అందజేయాలన్నారు. కార్మికులకు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు అందించే రెయిన్ కోట్‌లు, స్వెట్టర్లు, సబ్బులు, కొబ్బరి నూనె ఇతర సామగ్రిని పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాల్లో చేయడం లేదన్నారు. జమ చేయని మున్సిపల్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు సురేష్, జగన్, సుభాష్, రామాంజనేయులు, నవీన్, నరేందర్, రాము, లక్ష్మీనారాయణ, కార్మికులు భారతమ్మ, అంజమ్మ, పార్వతమ్మ, స్వరూప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230